క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి పడగ బహూకరణ



వెండి పడిగెను అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం దాతలు వెండి పడగను బహూకరించారు కర్నూలు పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు వి. నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు కేజీ వెండితో తయారు చేసిన పడగను అందించారని ఈఓ రామకృష్ణ తెలిపారు. అర్చకులు దాతలతో అర్చనలు, అభిషేకాలు, చేయించి తీర్థప్రసాదాలు అందించారు.


నేడు వాహనాల వేలం



పట్టుబడిన వాహనాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను సోమవారం వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు ఆదివారం తెలిపారు. సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వాహనాల వేలం పాటలో ఆసక్తి వ్యక్తులు వేలం పాడి పొందవచ్చునని సీఐ చెప్పారు.

ఎస్ఐ రాజారెడ్డి బదిలీ



ఓర్వకల్లు: ఓర్వకల్లు ఎస్ఐగా విధులు నిర్వర్తించిన రాజారెడ్డి ఆదివారం బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాజారెడ్డిని అవుక్ పోలీస్ స్టేషన్‌కు బదిలి చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసి న విషయం తెలిసిందే. ఈయన స్థానంలో ప్రస్తుతం వెల్దుర్తిలో పనిచేస్తున్న సునీల్‌కుమార్ ను నియమించినట్లు తెలిసింది. ఏడాదిపాటు విధులను సమర్థంగా నిర్వహించిన రాజారెడ్డి అనతి కాలంలోనే ప్రజల మన్ననలు పొందాడు.


ట్రాఫిక్ ఉల్లంఘనులకు కౌన్సెలింగ్



పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌చార్జ్ సీఐ జీవీ నాగరాజు

కర్నూలు కల్చరల్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జరిమానా తప్పదని కర్నూలు ట్రాఫిక్ ఇన్‌చార్జ్ సీఐ జీవీ నాగరాజు హెచ్చరించారు. సైలెన్సర్లు లేకుండా అధిక శబ్దాలతో తిరిగే 20 ద్విచక్ర వాహనాలను ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లో పట్టుకొని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించే వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

పని సర్దుబాటులో మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి

కర్నూలు కల్చరల్: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి కోరారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పదవీ విరమణతో ఆయా పాఠశాలల్లో కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పని సర్దుబాటును జీఓ నంబర్ 53 ప్రకారం చేపట్టాలని డిమాండ్ చేశారు. జూనియర్‌ను గుర్తించే విషయంలో క్యాడర్ సీనియారిటీని తప్పకుండా పాటించాలన్నారు. 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులకు పని సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

బలిజ సంఘం కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(అర్బన్): నగరంలోని అబ్బాస్ నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో నగర బలిజ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు అర్జా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడిగా టి.గోపినాథ్, కార్యదర్శిగా మండ్లం రవి, కోశాధికారిగా శైలేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు పత్తి ఓబులయ్య, చింతలపల్లి రామకృష్ణ, అల్లం రఘునాథ్, గాజుల సతీష్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, బ్రాహ్మణి, హేమలత, డాక్టర్ రంగనాయకులు పాల్గొన్నారు.

నీటి స్వచ్ఛత..నిర్లక్ష్యం స్పష్టత!

- పుట్టగొడుల్లా వెలసిన మినరల్ వాటర్ ప్లాంట్లు
- పల్లెల్లో జోరుగా నీటి వ్యాపారాలు
- లోపించిన నాణ్యత... పట్టించుకోని అధికారులు



ఓర్వకల్లు: ప్రతీది కల్తీ అవుతోంది. ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలు గుర్తిస్తున్న అక్రమార్కులు ధనార్జనే లక్ష్యంగా కల్తీ వ్యాపారాలు చేపడుతున్నారు. నిత్యావసరాలే కాదు చివరకు నీటిని కల్తీ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పట్టణాలకే పరిమితమైన మినరల్ వాటర్ గ్రామాలకూ పాకింది. దీంతో కొందరు అక్రమార్కులు కనీస నిబంధనలు పాటించకుండా మినరల్ వాటర్ ప్లాంట్లు నెలకొల్పి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో నిబంధనలు పాటించిన ప్లాంట్ నిర్వాహకులకు సైతం చెడ్డపేరు వస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, లోపించిన పారిశుద్ధ్య, కలుషితమైన నీరు, క్లోరినేషన్ చేయని నీటిని సరఫరా చేయడంతో ప్రజలు అనారోగాల భారిన పడుతామనే భయంతో మినరల్ నీటికి అలవాటు పడుతున్నారు. ఆ నీరు తాగడం వల్ల శరీరానికి హానికరమని తెలిసినా.. మరీ! డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నీటి స్వచ్ఛత ప్రమాణాలు పాటించడంలో నిర్వాహకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు 15 చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. వీటిలో కొందరు కనీస నిబంధనలు పాటించలేదనే విమర్శలు లేకపోలేదు.

మినరల్ వాటర్ ప్లాంట్ నిబంధనలు ఇలా...

సాధారణంగా వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా పంచాయతీ అధికారుల అనుమతి తీసుకోవాలి. నీటిని ఫిల్టర్ (శుద్ధి)చేసే పరికరాలన్నీ ఉండాలి. ప్లాంట్‌లో ఏసీతో పాటు, ఇద్దరు మైక్రోబయాలజీ, కెమికల్ టెక్నీషియన్లను నియమించుకోవాలి. పరిశ్రమ శాఖ నుంచి పార్టు-1 అనుమతి పొందాల్సి ఉంది. ఆ తర్వాత భారతీయ ప్రమాణాల(ఐఎస్ఐ)తో కూడిన ధృవీకరణ పత్రం తీసుకోవాలి. అయితే వాటర్ ప్లాంట్ నిర్వాహకులు వీటిలో కొన్నంటిని మాత్రమే తీసుకొని యథేచ్ఛగా బోరునీటినే ఫిల్టర్‌నీరుగా ప్రజలకు విచ్చలవిడిగా విక్రయిస్తూ వ్యాపారాలను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫిల్టర్‌నీటి(శుద్ధజలం) తయారీ ఇలా...

ఫిల్టర్‌నీటిని తయారు చేయడంలో నిబంధనల ప్రకారం ఒక లీటరు నీటిలో 1,500 మిల్లీ గ్రాముల సంపూర్ణంగా కరిగిన ఖనిజాలు లవణాలు(మినరల్స్) ఉండాలి. అందులో ఒక మిల్లీగ్రాము కాపర్, 0.3 మిల్లీ గ్రాముల ఇనుము, 45 మిల్లీ గ్రాముల నైట్రేట్, 200 మిల్లీ గ్రాముల క్లోరైడ్, 250 మిల్లీ గ్రాముల సల్ఫేట్ ఖనిజాల చొప్పున కనిష్టంగా ఉండాలి. అదేవిధంగా నీటిని శుద్ధి చేసే శాండ్(ఇసుక) ఫిల్టరేషన్ యాక్టివేటెడ్ కార్బన్, మిక్స్‌డ్ బెడ్, డీమినరలైజేషన్ ఫిల్లింగ్ యూనిట్ తదితర పరికరాలు ఉండాలి. ప్లాంట్లలోని నీటిని ప్రతిరోజుగాని, నెలలో ఒకరోజు నీటిని వేర్వేరుగా పరీక్షించి రికార్డులను అధికారులకు అప్పగించాలి. ఖనిజ లవణాల ప్రమాణాలు గుర్తించాల్సి ఉంది. అయితే నిర్వాహకులు వీటిని గాలికొదిలేసి, ఆటోలపై ట్యాంకర్లు పెట్టి ఇతర గ్రామాలకు తరలిస్తూ జోరుగా నీటి వ్యాపారాలు చేస్తున్నట్లు విమర్శలు గుప్పిస్తున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

నకిలీ మినరల్ వాటర్ తయారు చేస్తున్న ప్లాంట్లను తరచుగా రెవెన్యూ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. అయితే అధికారులు మాత్రం తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నప్పటికీ ప్లాంట్ల నిర్వహకుల పట్ల సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్లాంట్లలో నేగాక, కూల్ డ్రింక్ షాపుల్లోనూ ఫిల్టర్ ట్యాంకులను శుభ్రం చేయకుండానే ఫిల్టర్‌నీటిని బాటిళ్లల్లో నింపి అధిక ధరలకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

రేపు మండల మీట్

సి.బెళగల్: మండల పరిషత్ కార్యాలయంలో 13వ తేదీ ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షన సర్వసభ్య నిర్విహిస్తున్నట్లు ఏఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి వవరాల ఆరుసెట్లు సోమవారం మధ్యాహ్నంలోపు కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరై ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. మండల మీట్‌కు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయశ్రీ సూచించారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు.

గడివేముల: మండల కేంద్రం గడివేముల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. అన్ని శాఖల మండల అధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భోగేశ్వరంలో శ్రావణమాస సందడి



భోగేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన భోగేశ్వరం ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు స్థానిక పంచకోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి దుర్గా భోగేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం కాశిరెడ్డినాయన అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు. శివకేశవులకు శ్రావణమాసం ప్రీతికరం కావడంతో బిలకలగూడూరు వద్ద ఉన్న శ్రీ బాలాజీ ఆలయాన్ని భక్తులు సందర్శించారు. అదేవిధంగా మూలపెద్దమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తులతో కళకళలాడింది.

13న చలో హైదరాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య

కోడుమూరు రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు విచ్చేస్తున్న సందర్భంగా ఈనెల 13న నిర్వహించే మేదావుల ర్యాలీని జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన కోడుమూరులో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు 30సంవత్సరాల సుధీర్ఘ పోరాటానికి తెరదించిందన్నారు. మాదిగ, ఉపకులాలు సామాజికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో పోరాటం చేసిన ఘనత మందకృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ నాయకులు ప్రదీప్, సుగుర్ రాజు పాల్గొన్నారు.

నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: వరద ప్రవాహంపై మండల పరిధిలోని తుంగభద్ర నదీతీర గ్రామాల ప్రజలు, రైతులు నది నీటి అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. తుంగభద్ర డ్యామ్‌కు ఉన్న గేట్ కొట్టుకపోవడంతో దిగువకు పెద్ద ఎత్తున వరదనీటి ప్రవాహం వస్తుందని, ఏ మాత్రం ఏమరపాటు తగదన్నారు. నది దిగువకు దాదాపు లక్ష నుంచి లక్షనర క్యూసెక్కుల నీటిని విడదల చేసే అవకాశం ఉందని, ప్రమదకరంగా వరద ప్రవాహం ఉంటుందని హెచ్చరించారు. తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్స్యకారులు సైతం నదిలోకి చేపల వేటకు వెళ్లకూడదని, నది సమీపానికి కూడా ఎవ్వరూ వెళ్లొద్దని సూచించారు. అదేవిధంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు ప్రజలకు, రైతాంగానికి నదికి వచ్చే వరదనీటి ప్రవాహంపై అవగాహన కల్పించి జాగృతం చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో తిమ్మందొడ్డిలో వీఆర్వో శ్రీనివాసులు, వీఆర్ఏ వెంకటేష్ వరదనీటి అప్రమత్తతపై గ్రామంలో దండోరా వేయించారు.

అవయవ దానానికి ముందుకు రావాలి



అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు(హాస్పిటల్): మూఢ నమ్మకాలకు పోకుండా ప్రతిఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని రెండవ పటాలపు డీఎస్పీ మహబూబ్‌బాషా పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గార్గేయపురంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, స్పోర్ట్స్ క్యాంపునకు వచ్చిన వారికి అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవయవ దాన ఆవశ్యకతను వివరించే పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. వ్యక్తి జీవించి ఉన్నప్పుడే అవయవ దాన ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత అధికారికి అందజేయాలన్నారు. లేదా రెడ్‌క్రాస్ సొసైటీని సంప్రదించవచ్చని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒక వ్యక్తి అవయవాలను దానం చేయడం వల్ల ఎనిమిది మందికి పైగా ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. కంటి వైద్యులు డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ ప్రభాకర్, హెచ్ఎం వెంకటరాముడు, ఏసేపు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళాభ్యుదయం



టాపర్‌గా నిలిచిన విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి

కర్నూలు(అర్బన్): విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని, తల్లిదండ్రులు తమ కుమార్తెలను చదివించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఫర్‌మెన్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ నంబర్-1 కళాశాల బాలికల వసతి గృహంలో డిగ్రీలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. వసతి గృహ సంక్షేమాధికారిణి బెన్నమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇందిరాశాంతి మాట్లాడుతూ.. వసతి గృహంలో పలువురు విద్యార్థినులు కళాశాల టాపర్స్‌గా నిలవడం చాలా అభినందనీయమన్నారు. టాపర్స్‌కు శాలువా, పూలమాల తో ఘనంగా సన్మానించారు. అలాగే ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, వసతి గృహ సంక్షేమాధికారిణులు బెన్న మ్మ, రజనమ్మను కూడా ఘనంగా సన్మానించారు.

వైభవంగా సాయి శత రుద్రీయం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి పురస్కరించుకొని శ్రీ సత్యసాయి మయూరి గ్రీన్ ల్యాండ్స్ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీఅభీష్ట జ్ఞాన గణపతి స్వామి దేవస్థానంలో ఆదివారం నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయి చిత్రపటంతో శోభాయాత్ర నిరహించారు. కోలాటం, చెక్క భజనలు, సాయి నామ కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రశాంతి పతాకావిష్కరణ, గోమాత పూజ జరిగాయి. శ్రీ సత్యసాయి ప్రేమ తరు (మొక్కలు నాటడం), 91వ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. నిర్వాహకులు డాక్టర్ హరిశర్మ, శకుంతల, డాక్టర్ అనిల్ వేద బృందం, శ్రీ సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షుడు డి.సాయికృష్ణారెడ్డి, కన్వీనర్ పి.నాగిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గోదాములు ప్రారంభానికి నోచుకునేనా?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన గోదాములు

కల్లూరు: గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేసి వ్యవసాయ విప్లవానికి నాంది పలికింది. రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్‌బీకేలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను అనుసంధానం చేస్తూ బహుళార్థక గోదాములను నిర్మించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు కల్లూరు మండలలో మూడు బహుళార్థక గోదాముల నిర్మాణం పూర్తయింది. ఉలిందకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సొసైటీ పరిధిలో మూడు, కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ పరిధిలో రెండు బహుళార్థక గోదాములలో మంజూరయ్యాయి. అయితే నిర్మాణాలు పూర్తయిన గోదాములు సైతం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో రైతులు పాలకులు, అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పంటలకు భద్రత కల్పించేలా

మార్కెట్‌లో సరైన ధర లేనపుడు, ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడంతో పాటు వ్యవసాయ, ఉద్యానశాఖ పరిధిలో విత్తనాలు, ఎరువులు, ఇతర అగ్రి ఇన్‌పుట్స్ పంపిణీ సమయంలో ఉపయోగకరంగా ఉండేలా బహుళార్థక గోదాముల నిర్మాంచారు. కల్లూరు మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బహుళార్థక గోదాములను ఏర్పాటు చేసింది. ఉలిందకొండ పీఏసీఎస్ పరిధిలో చిన్నటేకూరు, పుసులూరు గ్రామాలకు చెందిన రెండు గోదాములను చిన్నటేకూరులో నిర్మించారు. కొలంపల్లితాండ రోడ్డులో నిర్మిస్తున్న గోదాము నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ పరిధిలో రెండు గోదాములు మంజూరయ్యాయి. అందుల్లో లక్ష్మిపురం పరిధిలో ఒకటి పూర్తి కాగా, మరొకటి పనులు ప్రారంభించలేదు.

ముగిసిన రోప్ స్కిప్పింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతగా గుంటూరు, రెండో స్థానంలో నంద్యాల, మూడో స్థానంలో అన్నమయ్య జిల్లా క్రీడాకారులు నిలిచారు. విజేతలకు అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా, నైస్ కంప్యూటర్స్ అధినేత రాయపాటి శ్రీనివాస్ కప్పులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు రూరల్ సీఐగా చంద్రబాబునాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉన్నతాధికారులతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆయన గతంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో ఎస్ఐగా, సీఐగా పనిచేశారు.

హిందూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలి

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ షష్ట్యబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ప్రఖండ డివిజన్లలో హిందూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకటరామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం వీహెచ్‌పీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీకి వీహెచ్‌పీ ఏర్పాటై 60 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, నగరాల్లో వీహెచ్‌పీ సమితుల నిర్మాణం జరగాలన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు ప్రఖండ కేంద్రాల్లో నిర్వహించ బోయే హిందూ ఆత్మీయ సమ్మేళనాల్లో అయోధ్య రాముడి ఆలయానికి నిధి సమర్పణ చేసిన ప్రముఖులు కుటుంబాలు పాల్గొనేలా చూడాలన్నారు. జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, కోశాధికారి సందడి మహేశ్వర్, రాష్ట్ర సేవా ప్రముఖ్ గురుమూర్తి, రాష్ట్ర కార్యాలయ సహాయక్ భూపాలచారి, ధర్మ ప్రసార్ విభాగ్ కన్వీనర్ విజయుడు, బజరంగ్ దళ్ కన్వీనర్ మీనుగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో నీటి సమస్య పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో నీటి సమస్యను పరిష్కరించాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును విన్నవించారు. ఆదివారం ఎంపీ స్వగృహంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆర్‌యూలోని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వర్సిటీలోని కాంట్రాక్ట్, ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మూడేళ్లుగా జీతాలు రావడం లేదని, బోధన, బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వర్సిటీ సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వీసీ ఎన్‌టీకే నాయక్ తెలిపారు.

విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర

కర్నూలు(సెంట్రల్): విద్యుత్‌శాఖలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉద్యోగులపై భారం తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో ఇంజినీర్ల కొరత వేధిస్తున్నా నియామకాలు చేపట్టడం లేదన్నారు. మూడు విద్యుత్ సంస్థల్లో 7500 మంది ఉద్యోగులు ఉండాల్సిన పరిస్థితుల్లో 2500 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు వీరేష్, సురేష్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

రెండు నెలలకే ధ్వంసమైన ఫుట్‌పాత్‌లు



గాయత్రీ ఎస్టేట్ సమీపంలో దెబ్బతిన్న ఫుట్‌పాత్

కర్నూలు (టౌన్): స్థానిక గాయత్రీ ఎస్టేట్ నుంచి బిర్లా గేట్‌కు వెళ్లే రహదారిలో ఇటీవల ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టారు. స్మార్ట్ స్ట్రీట్ పేరుతో నగరపాలక జనరల్ ఫండ్ నుంచి రూ.15 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో రిలయన్స్ స్టోర్ నుంచి రహ దారి విస్తరణ, ఫుట్‌పాత్ నిర్మాణం వంటి పనులు చేపట్టారు. అయితే రెండు నెలలు కూడా పూర్తి గాకముందే ఫుట్‌పాత్ దెబ్బతింది. ఏ ఒక్కరూ నడవ లేని విధంగా ధంస్వం కావడానికి కారణం పనుల్లో నాణ్యత లోపించమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. పనులు అధ్వానంగా చేసిన కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణను పట్టించుకోని నగర పాలక ఇంజినీరింగ్ అధికారులపై విమర్శలు వస్తున్నాయి.

భక్తిశ్రద్ధలతో జలాభిషేకం



కర్నూలు కల్చరల్: భాను సప్తమిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వయంగా స్వామి వారికి సుగంధ ద్రవ్య జలాలతో అభిషేకం చేశారు. అరుణ హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



తీరని ‘కొర్రవాగు’ కష్టం

కొర్రవాగులలో ప్రదహిస్తున్న నీటిని దాటుతున్న రైతు

పాణ్యం: మండల పరిధిలోని అహల్యాపురం-భూపనపాడు గ్రామాల మధ్య వ్యవసాయ పొలాలకు వెళాల్లంటే రైతులకు కొర్రవాగు పరీక్ష తప్పడం లేదు. అహల్యాపురం గ్రామం సమీపానున్న కొర్రవాగు అవతల దాదాపుగా 500ఎకరాల సాగు భూమి ఉంది. రైతులు పొలాలకు వెళ్లాంలటే ఈ వాగు దాటాల్సిదే. అయితే ఈ వాగు ఏడాదిలో ఎనిమిది నెలల పాటు ప్రవహిస్తూనే ఉంటుంది. నెల రోజుల నుంచి వాగకు ఉధృతంగా ప్రవహిస్తుంది. అయినా ఈ నీటిలోనే రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సి ఉంటుంది. ఇతర మార్గంలో వెళ్లాలంటే అనూపురు సమీపంలో సుమారు మూడు కిలోమీటర్ల నడిచి అవతలకు చేరుకోవాలి. ప్రస్తుతం వర్షాపునీరు, కాల్వ ద్వారా వచ్చే నీరు ఏకమై... వాగు ప్రవహిస్తున్నాయి. ఈ నీటి దాటికి రైతులు అత్యతం కష్టంమీదుగా వాగు దాటుతారు. పొలాలకు ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లాలంటే రైతులు చూట్టు తిరిగి వెళ్తారు. ప్రతి ఏటా రైతులకు ఈ కష్టం తప్పడం లేదు. ఇక మహిళలు వెళ్లాంలటే అష్టకష్టాలు పడాల్సి ఉంటుంది. వాగు అవతల పొలాలకు వెళ్లాంటే రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పర్యటించి రైతులకు ఇబ్బంది లేకుండా కాజ్‌వేను ఏర్పాటుల చేయాలని రైతులు కోరుతున్నారు.